అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, ఆగస్టు 29: లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ.లక్ష్మీ శారద అన్నారు. గురువారం జిల్లా న్యాయ స్థానాల సముదాయంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 28న నిర్వహించే లోక్ అదాలత్‌లో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ కుదుర్చుకునేలా పోలీస్ అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మింది ఓ చోట.. భూమి మరో చోట

- వ్యాపారిని నమ్మించి మోసగించిన వైనం
- ఆరుగురిపై కేసునమోదు

భూమి వద్ద విచారణ చేపట్టిన ఎస్సై శంకర్

పెద్దశంకరంపేట, ఆగస్టు 29: మండలంలోని ఉత్తులూరు గ్రామ శివారులో భూమి విక్రయించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాజారాం తండా, ముకుందానాయక్ తండాలకు చెందిన సాగర్ చౌహన్, దేవిదాస్, రమకాంత్, వెంకట్, చందర్, జాదవ్ ముతాగా ఏర్పడ్డారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి వరప్రసాద్‌ను తక్కువ ధరకే భూమి వస్తుందని ఉత్తులూర్ శివారులో సాగులో ఉన్న భూమిని చూపించారు. ఉత్తులూరు గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డిగారి దుర్గయ్య, కృష్ణ, యాదగిరి శంకర్‌లకు చెందిన మూడెకరాల భూమిని వరప్రసాద్‌కు ఎకరా రూ.12 లక్షల చొప్పున అమ్మారు. నిజాంసాగర్ బ్యాంక్ వాటర్‌కు ఆనుకుని ఉన్న భూమిని పట్టా చేయించారు. మధ్యవర్తులు భూ యజమానికి ఎకరాకు రూ.3 లక్షల చొప్పున చెల్లించారు. ఆ తర్వాత వ్యాపారి తన భూమిలోకి వెళ్లగా ఈ భూమి తమదంటూ అక్కడి రైతులు తెలిపారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఆశ్రయించారు. వరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఆరుగురు నారాయణఖేడ్, కంగ్టి, తదితర మండలాల్లో ఈ విధంగానే మోసం చేయగా వారిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి.

ముగిసిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

రామాయంపేట, ఆగస్టు 29: పట్టణంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. విజయం సాధించిన క్రీడాకారులకు యువజ్యోతి క్లబ్ అధ్యక్షుడు బొంతల సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ఫైనల్‌లో మెదక్ జిల్లా రామాయంపేట, కామారెడ్డి జిల్లా రథాలరాంరెడ్డి మండలాలకు చెందిన జట్లు తలపడగా రథాల రాంరెడ్డికి చెందిన టీం విజయం సాధించింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, వెంకటేశం, దామోదర్, స్వామి, యుగంధర్, వినయ్‌సాగర్, కమలాకర్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు మాతృభాషా దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ/ పెద్దశంకరంపేట, ఆగస్టు 29: పరిపూర్ణ మానసిక వికాసానికి తెలుగు భాషనే ప్రధానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గణపతి, మల్లేశం, రాజాగౌడ్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ శర్మ, అరుంధతి పాల్గొన్నారు. పెద్దశంకరంపేట లోని జడ్పీహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గురువారం క్విజ్‌పోటీలు నిర్వహించారు. తెలుగు భాష విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విఠల్ తదితరులున్నారు.

కేసీఆర్ కాలనీలో దొంగల హల్‌చల్

బీరువాను పగులగొట్టిన దుండగులు

రామాయంపేట, ఆగస్టు 29: పది ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగలు హల్‌చల్ చేసిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీఆర్ కాలనీలో గురువారం జరిగింది. సీఐ వెంకటరాజగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో తాళాలున్న పది ఇండ్ల తాళాలను దుండగులు పగులగొట్టి అందిన కాడికి దోచుకునిపోయారు. కాలనీలోని నాగరాణికి చెందిన రెండు గ్రాముల బంగారు కమ్మలు, రెండు వెండి కుంకుమ భరిణీలు, ఒడ్డె పెంటమ్మకు చెందిన ఐదు పట్టుచీరెలు, ప్రేమలతకు చెందిన పది తులాల వెండి వస్తువులు, సంతోషవి రూ.10వేలు దొంగలించబడ్డాయి. క్లూస్‌టీం వేలి ముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

పాముల గురించి వివరిస్తున్న సదాశివయ్య

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 29: జీవ వైవి ధ్య సంరక్షణతోనే మన పరిరక్షణ అని డాక్టర్ సదాశివయ్య తెలిపారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో జీవ వైవిధ్య సంరక్షణపై కార్యశాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు సదాశివయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని విద్యావ్యవస్థల్లో జీవ వైవిధ్యంపై వివిధ పాఠ్యాంశాలు చేర్చారన్నారు. అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదన్నారు. జీవ వైవిధ్యంతో ఔషధాలు తీసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాములను చూడగానే భయంతో చంపేస్తున్నారన్నారన్నారు. ఒక జెర్రిపోతు ఏడాదిలో మూడు వేల ఎలుకలు తింటుందని, దీంతో రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. కార్యశాలలో ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

- గణేష్ మండపాలకు అనుమతులు ఉండాలి
- ఉత్సవాలకు డీజేలు నిషేధం

రామాయంపేట/నిజాంపేట/పెద్దశంకరంపేట/చిలిపిచెడ్, ఆగస్టు29: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు అధికారులు తెలిపారు. గణేశ్ మండపాలకు నిర్వాహకులు పోలీసుల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. గురువారం ఆయా పోలీస్ స్టేషన్లలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. గణేశ్ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విగ్రహాల ఊరేగింపులో డీజేలకు అనుమతులు లేవన్నారు. డీజేలు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా గణేశ్ నవరాత్రులను పూర్తి చేసుకోవాలని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు

కారును పరిశీలిస్తున్న ఎస్సై యాదగిరి

చిలిపిచెడ్, ఆగస్టు 29: అదుపు తప్పి కారు బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చండూర్ శివారులో గురువారం జరిగింది. మారుతి కారు మెదక్ నుంచి జోగిపేటకు వెళ్తున్నది. అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొన్నది. దీంతో డ్రైవర్ మాణ్యికరెడ్డితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలపాలైయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై యాదగిరి, ఏఎస్సై మిస్బోద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఎస్‌జీటీయూ మండల కార్యవర్గం ఏర్పాటు

నిజాంపేట, ఆగస్టు 29: నిజాంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీయూ మండల కార్యవర్గం గురువారం ఎంపికైంది. అధ్యక్షుడిగా పరశురాములు, ప్రధాన కార్యదర్శిగా దశరథం, మహిళా అధ్యక్షురాలిగా స్వప్న, ఉపాధ్యక్షురాలిగా సాగరిక, కోశాధికారిగా పరమేశ్వర్, కార్యదర్శిగా శ్రీకాంత్ ఎంపికయ్యారు.

పకడ్బందీగా కుటుంబ నిర్ధారణ సర్వే



చిలిపిచెడ్: వివరాలు సేకరిస్తున్న డీఏవో గోవింద్

మెదక్ రూరల్: సర్వేను పరిశీస్తున్న ఏడీ విజయనిర్మల

రామాయంపేట: రుణమాఫీ సర్వే చేస్తున్న అధికారులు

- ప్రత్యేక యాప్‌లో పంట రుణమాఫీ నిర్ధారణ
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్

చిలిపిచెడ్, ఆగస్టు 29: రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల వివరాలను ఫోన్ యాప్‌లో సేకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ తెలిపారు. చండూర్‌లో రైతుల ఇంటికి ఏవో రాజశేఖర్‌గౌడ్‌తో వెళ్లి పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పంట రుణమాఫీ రాని అర్హులకు త్వరలోనే మొబైల్ ప్రత్యేక యాప్ ద్వారా రుణమాఫీ అందిస్తామన్నారు. ఈ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి రుణమాఫీ అందించేందుకు చర్యలు తీసుకుటున్నామన్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే

మెదక్‌రూరల్, ఆగస్టు 29: రెండు లక్షల్లోపు పంట రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణకు క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా సర్వే చేపట్టాలని మెదక్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు విజయనిర్మల ఆదేశించారు. గురువారం మండలంలోని మాచవరంలో సర్వేను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఏవో శ్రీనివాస్, ఏఈవో రాజశేఖర్, మాచవరం సొసైటీ చైర్మన్ సీతారామయ్య ఉన్నారు.

పంట రుణమాఫీకి ప్రత్యేక యాప్

రామాయంపేట, ఆగస్టు 29: పంట రుణమాఫీ కాని రైతులకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక యాప్‌తో డిక్లరేషన్ చేస్తున్నట్లు ఏవో రాజ్‌నారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా 635 మంది రైతులకు పంట రుణమాఫీ వర్తించేలా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయనతో వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయికృష్ణ ఉన్నారు.

రైతు కుటుంబాల వివరాల సేకరణ...

వెల్దుర్తి, ఆగస్టు 29: కుటుంబంలో రూ.2 లక్షల లోపు పంట రుణాలు కలిగి ఉండి మాఫీ కాని వారి వివరాలు సేకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారిణి ఝాన్సీ తెలిపారు. మండలంలోని మంగళపర్తిలో ఏఈవో గౌతమితో కలిసి రైతు కుటుంబ వివరాలను సేకరించారు.

నర్సాపూర్‌లో రుణమాఫీపై సర్వే

నర్సాపూర్, ఆగస్టు 29: పంట రుణమాఫీ జరగని రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నామని ఏవో దీపిక తెలిపారు. మండలంలోని లింగాపూర్, నారాయణపూర్, ఖాజీపేట్, మంతూర్, రెడ్డిపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో దుర్గాప్రసాద్, ఏటీఎం హరీశ్ పాల్గొన్నారు.



వెల్దుర్తి: మంగళపర్తిలో ఏవో ఝాన్సీ

నర్సాపూర్: లింగాపూర్‌లో ఏవో దీపిక

మిత్తి కడితేనే పంట రుణమాఫీ: ఎస్బీఐ

నర్సాపూర్ ఎస్బీఐ ఎదుట రైతులు, ఖాతాదారులు

నర్సాపూర్, ఆగస్టు 29: మిత్తి కడితేనే పంట రుణమాఫీ చేస్తామని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో నర్సాపూర్‌లోని ఎస్బీఐ ఎదుట రైతు లు, ఖాతాదారులు గురువారం పెద్ద సంఖ్యలో బారులుదీరారు. దీంతో బ్యాంకు సిబ్బంది తలపులు మూసి, ఒక్కొక్కరిని లోనికి పంపించారు. బ్యాంకు ముందర క్యూలైన్‌లో నిలుబడలేక రైతులు అవస్థలు పడ్డారు. బ్యాంకులో డబ్బులు డిపాజిట్, విత్‌డ్రా చేయడానికి వచ్చిన ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

క్రీడలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి

బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రామాయంపేటలో సైకిల్ రన్ ప్రారంభిస్తున్న సీఐ

టేక్మాల్‌లో 2కే రన్‌లో విద్యార్థులు, యువకులు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి
- 2కే సైకిల్ రన్ ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా క్రీడా దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట/మెదక్‌రూరల్/అల్లాదుర్గం/తూప్రాన్/చిన్నశంకరంపేట, ఆగస్టు 29: జిల్లాలో క్రీడలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక మెదక్ స్టేడియంలో జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వరు మాట్లాడుతూ భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత హాకీ వంటి క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో పెట్స్ క్లబ్, పీఈటీ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్ చౌరస్తాలో తపస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రామాయంపేటలో మెదక్ చౌరస్తా వద్ద 2కే సైకిల్ రన్‌ను ప్రాంభించి ప్రతిభ కనబర్చిన విద్యార్థి విజేతలకు బహుమతులను అందజేశారు. టేక్మాల్‌లోని చౌరస్తా నుంచి ఉన్నత పాఠశాల వరకు పీఈటీల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్‌ఫెడరేషన్ గేమ్స్ నిర్వహించారు. ను ఎంపీడీవో దామోదర్, ఎంఈవోతో కలిసి ప్రారంభించారు. తూప్రాన్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండ్ జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను డీఈవో రాధాకిషన్ ప్రారంభించారు.

తూప్రాన్‌లో పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

చిన్నశంకరంపేటలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్సై

ఇండోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్‌కు నాయకుల నివాళి

పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- కుటుంబీకుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో
- వంద శాతం ఓటరు మెర్జింగ్ పూర్తి చేస్తాం
- 493 పంచాయతీల్లో 4232 వార్డులు
- అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మెదక్ ఐడీవోసీ కార్యాలయంలోని రెవెన్యూ చాంబర్లో ధాన్యం కొనుగోలు కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,01,966 హెక్టార్లలో ధాన్యం సాగయ్యిందన్నారు. ఈ సీజన్లో 6,11,795 టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో రైతు సొంత అవసరాలు, విత్తనాల కోసం, ఇతర ట్రేడర్ల కొనుగోలు పోను దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కోటి గోనె సంచులు అవసరమవుతాయని, ప్రస్తుతం 50 లక్షలు అందుబాటులో ఉన్నాయని జిల్లా మేనేజర్ సివిల్ సప్లయ్ కమిటీ తెలిపింది. జిల్లాలో 400 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సామగ్రి సమకూర్చాలని జిల్లా మార్కెటింగ్ అధికారికి ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, జిల్లా సహకార అధికారి కరుణ, జిల్లా పౌరసఫరాల శాఖ మేనేజర్ హరికృష్ణ, మార్కెటింగ్ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఒకే పోలింగ్ కేంద్రంలో ఒకే కుటుంబీకుల ఓట్లు

కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా ఓటరు మెర్జింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఐడీవోసీ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పార్థసారథి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లో 493 పంచాయతీలు, 4232 వార్డులు ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 6న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాల్సి ఉన్నదని, వార్డులు వారీగా కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా ఓటరు జాబితా మెర్జింగ్ జరుగుతున్నదన్నారు. టీఈ పోల్ సాఫ్ట్‌వేర్‌లో ఓటరు జాబితా మెర్జింగ్ జరుగుతున్నదన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 50 శాతం మెర్జింగ్ పూర్తి చేశామని, మిగిలిన 50 శాతం రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సెప్టెంబ ర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నామని, ఈ జాబితాపై సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 9న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లాలో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది ఓటరు జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో రెండు పంచాయతీల ఏర్పాటు

పంచాయతీల్లో ఎనిమిది వార్డులు ఏర్పాటు

వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో ఓటర్లను విభజిస్తున్న పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోలు

వెల్దుర్తి, ఆగస్టు 28: ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని రెండు గ్రామాలు పంచాయతీలుగా అవతరించనున్నాయి. ప్రజల అభీష్టం మేరకు వారు కోరుకున్న ప్రకారం మధిర గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీల, ఎలుకపల్లి గ్రామాలు నూతన పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నూతన పంచాయతీల్లో ఎనిమిది వార్డుల చొప్పున ఏర్పాటు చేయాలన్న ఆదేశాల మేరకు ఉన్న ఓటర్లను విభజిస్తున్నారు. వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో ఈవో బలరాంరెడ్డి ఆధ్వర్యంలో బీఎల్‌వోలు ఓటర్ల విభజన చేస్తున్నారు. 2011 జనాభా ప్రకారం శేరీలలో 1309, ఎలుకపల్లిలో 487 జనాభా ఉన్నారు. ఉమ్మ డి మండలంలో 30 పంచాయతీలు ఉన్నా యి. మాసాయిపేట మండలం ఏర్పాటుతో తొమ్మిది పంచాయతీలు అందులోకి వెళ్లా యి. దీంతో వెల్దుర్తి మండలంలో 21 పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు కొత్తగా ఏర్పాటు కానుండడంతో మండలంలో 23 పంచాయతీలకు పెరిగాయి.

ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి, ఆగస్టు 29: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారని మాసాయిపేట డాక్టర్ శ్రీదేవి తెలిపారు. గురువారం మాసాయిపేటలో వృద్ధుల జెరియాట్రిక్స్ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలకు ఉచితంగా చికిత్సలు అందించారు. మెదడు, వెన్నెముక, కంటి సంబంధిత, వినికిడి, జీర్ణాశయాంతర, శ్వాసకోశ, జననేంద్రియ, మూత్ర సంబంధిత వ్యాధులకు చికిత్సలు చేసి, మందులు అందజేశారు. తహసీల్దార్ జ్ఞానజ్యోతి, డాక్టర్లు శ్రీనివాస్, అనిల్, ఫార్మాసిస్ట్ మంజూర్ అలీ పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచితంగా మందులు అందజేస్తున్న తహసీల్దార్, డాక్టర్లు

బస్సుల సంఖ్య పెంచాలి

కిక్కిరిసి వెళ్తున్న బస్సు

పాపన్నపేట, ఆగస్టు 29: మెదక్ బోడ్మట్‌పల్లి రూట్‌లో బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ అధికారులకు ఏబీవీపీ మండల నాయకుడు ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. ఈ రహదారిలో అవసరమైన మేరకు బస్సుల్లేక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం కాలేజీకి పాపన్నపేట పాఠశాలకు వచ్చే విద్యార్థులకు బస్సుల్లేకపోవడంతో కిక్కిరిసి పస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే బస్సుల సంఖ్య పెంచాల్సిందిగా ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ

చిలిపిచెడ్, ఆగస్టు 29: పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని నర్సాపూర్ నియోజకర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం అజ్జమర్రి గ్రామానికి చెందిన బయికాడి ఎల్లమ్మకు మంజూరైన రూ.32,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శివ్వంపేట, ఆగస్టు 29: శివ్వంపేటలో శుక్రవారం ఉదయం మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేస్తారని లబ్ధిదారులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.

2 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

చేగుంట, ఆగస్టు 29: వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల ఉపాధ్యాయ పీడీలు తెలిపారు. చేగుంట లోని ఎంఆర్సీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. అండర్14, 17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీడీలు శారద, నాగరాజు, మంజులత, శంకర్ తదితరులున్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

నర్సాపూర్, ఆగస్ట్ 29: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నేడు, రేపు నిర్వహించనున్నట్లు ఎంఈవో బుచ్చానాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు మండల స్థాయి అండర్-14, అండర్-13 బాలబాలికలకు నర్సాపూర్‌లోని టీటీడబ్ల్యూఆర్ఎస్ మైదానంలో జరుగుతాయని తెలిపారు.

దాడిచేసిన వారిపై కేసు

శివ్వంపేట, ఆగస్టు 29: ఓ కంపెనీ సూపర్‌వైజర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్యాతండా పంచాయతీలోని సీడ్ కంపెనీలో తండాకు చెందిన జగన్, సీత్య, రాజ్య, గమ్య అక్రమంగా వెళ్లి ధ్వంసం చేశారు. లోపలికి వెళ్లి అక్కడ లేబర్ విషయంలో గొడవ చేసి సూపర్‌వైజర్ బా నోత్ కుమార్‌పై దాడి చేశారు. బానోత్‌కు మార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండాపూర్‌లో కల్యాణ మండపానికి భూమి పూజ

చేగుంట, ఆగస్టు 29: మండలంలోని బీ కొండాపూర్ సింగరాయుని గుట్ట లక్ష్మీనర్సిహస్వామి ఆలయంలో కల్యాణ మండపానికి గురువారం భూమి పూజచేశారు. ఖాజీపూర్‌కు చెందిన బొండుగులపాటి సీతారామారావు తనయుడు సినీ నటుడు శ్రవణ్ కుమార్ రాఘవేంద్ర సహకారంతో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కల్యాణ మండపం షెడ్డు నిర్మాణానికి రూ.రెండున్నర లక్షల విరాళం అందజేశారు. కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తోట రమేశ్, బుర్ల శ్రీనివాస్, రాజిరెడ్డి, పూజారి ప్రసాదచారి, ప్రభాకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్నాల్‌పల్లిలో మహా సుదర్శన యాగం

చేగుంట, ఆగస్టు 29: మండలంలోని కర్నాల్‌పల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో మహా సుదర్శన యాగం, రుద్రహోమం గురువారం నిర్వహించారు. శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో వైదిక కార్యక్రమాలను శాస్తుల రాజేశ్వరశర్మ, ఈశ్వరీ పీఠ వ్యవస్థాపకుడు అయాచితం రవిచంద్రశర్మ, ఆలయ